క్లుప్తంగా

కేజీహెచ్ సేవా వార్డుకు గీజర్ వితరణ



రోగులకు రగ్గులు, మాస్కులు, పండ్లు అందజేస్తున్న జేకే నాయక్

డాబాగార్డెన్స్ : ఒడిశా స్టీవ్‌డోర్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కేజీహెచ్ సేవా వార్డుకు గీజర్ పరికరాన్ని, రోగులకు రగ్గులు, మాస్కులు, డైపర్స్, పండ్లు వితరణ చేసింది. ఒడిశా స్టీవ్ డోర్స్ వైస్ ప్రెసిడెంట్ జేకే నాయక్ వీటిని గురువారం అందజేశారు. వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణాదేవి వితరణగా అందించిన సామగ్రిని స్వీకరించి వార్డు అవసరాలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ ఉషా ప్రసాద్, డాక్టర్లు జగదీష్, ఆనంద్, సాగర్‌బాబుతో పాటు హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్, సభ్యుడు మల్లేశ్వరరావు, రెయ్యి డేవిడ్‌రాజు, హెడ్ నర్స్‌లు మణి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో నేటి కార్యక్రమాలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించనున్నారు.

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం



సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయో టెక్నాలజీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో గురువారం మానవ పోషణ-ఆరోగ్యంలో చిరుధాన్యాల పాత్రపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనకాపల్లి అగ్రికల్చర్ రీసెర్చి విభాగానికి చెందిన డాక్టర్ పీవీ జగన్నాథరావు, ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఎన్. అనురాధ పాల్గొని మిల్లెట్స్ ప్రాముఖ్యత గురించి వివరించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎ. వీరబ్రహ్మం మాట్లాడుతూ పోషకాహార ఉపయోగాలు తెలిసేలా సింపోజియం నిర్వహిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం మిల్లెట్ సంబంధిత ఆహారాన్ని అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ పీకే జయలక్ష్మి, తేజశ్విని, దీపిక, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

సీతమ్మధార : భవన నిర్మాణ కార్మికులకు చెందిన రూ. కోటీ 30 లక్షలు వేరే పథకాల కోసం మళ్లించి వారి పొట్ట కొట్టడం విచారకరమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెంకటరావు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరావు, అనసూయ మాట్లాడుతూ కోవిడ్ కారణంగా పనులు దొరక్క భవన నిర్మాణ కార్మికుల జీవితం అతలాకుతలం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, సూరి అప్పారావు, నారాయణరావు, పార్వతమ్మ, లక్ష్మి, పెంటరావు తదితరులు పాల్గొన్నారు.



కోస్టల్ బ్యాటరీ డౌన్‌లో ఆధునికీకరించిన ఐల్యాండ్, ఇటీవల వేసిన బీటీ మిక్స్ రోడ్డు

ఇది కదా అభివృద్ధి

సోయగాల సాగరతీరం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విశాఖ అందాలు ఇనుమడిస్తున్నాయి. గతంలో పర్యాటకంగా పేరున్న ప్రాంతాలు కూడా సరైన అభివృద్ధి లేక బోసిపోయి కనిపించేవి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నగరంలోని అన్ని ప్రాంతాలను ఒకేలా అభివృద్ధి చేస్తూ నగర అందాలను ద్విగుణీకృతం చేస్తోంది. అందులో భాగంగా దక్షిణ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే బీచ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది. లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి చేపట్టిన ఈ పనుల వల్ల ఇప్పుడు సాగరతీరం కొత్తందాలతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులను అలరిస్తోంది.



గోడలకు అద్భుతమైన పెయింటింగ్స్



బీచ్‌రోడ్డులో సుందరీకరించిన ఐల్యాండ్

- అభివృద్ధిపథాన సౌత్‌బీచ్
- పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్కే బీచ్ వరకు సుందరీకరణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు

డాబాగార్డెన్స్ : సౌత్ బీచ్ (నియోజకవర్గ పరిధిలో గల సాగర తీర ప్రాంతం)కు మంచి రోజులు వచ్చాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా కోస్టల్ బ్యాటరీ డౌన్‌లో రోడ్లు వేశారు. ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టారు. పార్కులు సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు వెలిగించారు. ఈ పనులన్నీ ఇటీవల కాలంలో చేపట్టినవే. జి-20 సదస్సు, ఇన్ఫినిటీ వైజాగ్-2023, వైజాగ్ టెక్ సమ్మిట్, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వంటి శిఖరాగ్ర సమావేశాల దృష్ట్యా సుమారు కోట్లాది రూపాయలతో పలు పనులు చేపట్టారు. 29వ వార్డు పరిధి బీచ్‌రోడ్డులో ఉన్న ప్రస్తుత రిటైనింగ్ వాల్‌పై పారాపెట్ వాల్‌ను సుందరీకరించారు. చిల్డ్రన్ పార్క్ నుంచి సీ పెరల్ పార్కింగ్ వరకు ఉన్న ప్రహరీకి గ్రానైట్ (నార్త్ సైడ్) స్ట్రెచ్‌ను అభివృద్ధి చేశారు. పాత పారాపెట్ వాల్‌పై ఉన్న పైపులు తొలగించి గోడ ఎత్తు పెంచి గ్రానైట్ బెంచీలు ఏర్పాటు చేశారు. రూ.44 లక్షలతో పాత మున్సిపల్ కార్యాలయం (బీచ్ రోడ్డు టౌన్ హాల్ నుంచి) సిఫ్‌నెట్ జంక్షన్ వరకు రోడ్డు అంచు నుంచి కెర్బ్ వాల్ వరకు ఇంటర్ లాకింగ్ కాంక్రీట్ పేవ్‌మెంట్ వేసి అభివృద్ధి చేశారు. అలాగే రూ.34.85 లక్షలతో పాత మున్సిపల్ ఆఫీస్ నుంచి రామకృష్ణా బీచ్ వరకు ప్రస్తుత రిటైనింగ్ వాల్‌పై పారాపెట్ వాల్‌ను అందంగా తీర్చిదిద్దారు.

సాగరతీరం అభివృద్ధి.. చేసిన ఖర్చు

- రూ.44 లక్షలతో పాత మున్సిపల్ కార్యాలయం నుంచి సిఫ్‌నెట్ జంక్షన్ వరకు రోడ్డు అభివృద్ధి
- చిల్డ్రన్ పార్క్ నుంచి సీ పెరల్ పార్కింగ్ వరకు ఉన్న ప్రహరీ అభివృద్ధి
- రూ.34.85 లక్షలతో పాత మున్సిపల్ ఆఫీస్ నుంచి రామకృష్ణా బీచ్ వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణం.. సుందరీకరణ
- 29వ వార్డు పరిధి బీచ్‌రోడ్డులో ఉన్న ప్రస్తుత రిటైనింగ్ వాల్ సుందరీకరణ

బీచ్ రోడ్లు బాగున్నాయి..



గత కొంత కాలంగా రోడ్లు ఇబ్బందికరంగా ఉండేవి. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇటీవల నగరంలో ఎక్కడికక్కడ రోడ్లు అభివృద్ధి చేయడం శుభపరిణామం. కలెక్టర్ కార్యాలయం నుంచి కోస్టల్ బ్యాటరీ డౌన్ రోడ్డు, కోస్టల్ బ్యాటరీ బీచ్ రోడ్డు నుంచి నోవాటెల్ పార్క్ వరకు రోడ్డు బాగుంది.

– వర్రి నాగ అరుణ్‌కుమార్, మహారాణిపేట

అందంగా తీర్చిదిద్దారు..



పాతనగరంలో పాత మున్సిపల్ కార్యాలయం (బీచ్‌రోడ్డు టౌన్ హాల్ నుంచి) సిఫ్‌నెట్ జంక్షన్ వరకు, అక్కడి నుంచి కోస్టల్ బ్యాటరీ డౌన్ రోడ్డు వరకు రోడ్డు పనులు పూర్తి చేశారు. దీంతో ఈ ప్రాంతాల్లో రాకపోకలకు వెసులుబాటుగా ఉంది. రోడ్లు బాగుపడడంతో సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

– బందారు లోకేష్‌కుమార్, కలెక్టరేట్ ఏరియా

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు
- హోరాహోరీ తలపడుతున్న క్రీడాకారులు



స్కూల్ వారియర్స్.. డేంజర్ బాయ్స్ మధ్య జరుగుతున్న క్రికెట్ పోటీ



విజేత జట్టు సభ్యులతో పీతల వాసు

డాబాగార్డెన్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలకు విశేష స్పందన వస్తోంది. నియోజకవర్గ పరిధిలో ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, మెడికల్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న పలు పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొంది. దీంతో ఆయా గ్రౌండ్లు క్రీడాకారులతో కళకళలాడుతున్నాయి. బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలకు స్పందన వస్తోంది. దీనిలో భాగంగా మెడికల్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన క్రికెట్ పోటీలో రామజోగిపేట సచివాలయ పరిధిలో గల స్కూల్ వారియర్స్, డేంజర్ బాయ్స్ జట్ల మధ్య పోటీ జరిగింది. దీనిలో స్కూల్ వారియర్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు నియోజకవర్గ క్లస్టర్-4 మండల అధ్యక్షుడు పీతల వాసు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బెవర మహేష్, కోరాడ సురేష్, బుల్లెట్ రవి, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీ తలపడిన క్రీడాకారులు..

జగదాంబ : గురువారం ఏవీఎన్ కళాశాల, క్వీన్ మేరీ పాఠశాల, సెంట్ అలోసిస్ పాఠశాల, ఆంధ్రా మెడికల్ కళాశాలలో క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి 86 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీ పోరాడి సత్తా చాటారు.



ఇందిర ప్రియదర్శిని గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న యువకులు



సెయింట్ అలోసిస్ గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



ఆంధ్రా మెడికల్ కళాశాల వద్ద పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు



కోకో ఆడుతున్న క్రీడాకారులు

ముత్యాల వస్త్రాలంకరణలో కన్యకా పరమేశ్వరి



ముత్యాల వస్త్రాలంకరణలో కన్యకా పరమేశ్వరి



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

డాబాగార్డెన్స్ : పాతనగంలోని కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మూడో గురువారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు ముత్యాల వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రాతఃకాల విశేష అర్చనలు, ప్రత్యేక పూజల అనంతరం 108 సువర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ సంఘ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే ప్రతి గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పాలూరి వరప్రసాద్, కొల్లూరు రాము, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీల వసూళ్లు వేగవంతం కావాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : యూజర్ చార్జీల వసూళ్లు వేగవంతం చేయాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో ఎ.రాజేష్ అన్నారు. గురువారం ఆయన జోన్ -4 పరిధిలో గల వార్డుల్లో పర్యటించారు. సెక్రటరీలతో కలిసి యూజర్ చార్జీలు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో రెండు రోజులు బుధవారం, శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. చెత్త సేకరణకు ప్రతి ఇంటికి వెళ్లినప్పుడే ఇలా చేస్తే పని సులువు అవుతుందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సెక్రటరీలు కూడా విధిగా యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. వసూలైన మొత్తాన్ని ఎప్పటికప్పుడు జీవీఎంసీ సౌకర్యం సెంటర్‌లో చెల్లించి రసీదు తీసుకోవాలని సూచించారు. మురికివాడల్లోనే ఎక్కువ బకాయిలు ఉన్నాయని వాటిని కూడా వసూలు చేసే బాధ్యత ఇన్‌స్పెక్టర్లదే అన్నారు. అదే విధంగా ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్స్‌కు చెందిన వసూళ్లు కూడా వేగవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి తిరుప్పావడ సేవ



గజ వాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి



తిరుప్పావడ సేవలో వెంకన్న

ఎంవీపీ కాలనీ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న స్వామి వారి ఎదుట పులిహోర కుప్పగా పోసి, వడలు నివేదించారు. అనంతరం నిత్యాగోష్టిలో పాల్గొన్న భక్తులందరికీ వడలు, పులిహోర, దద్దోజనం, పొంగలి ప్రసాదం అందజేశారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా శ్రీభూనీలా సహిత శ్రీనివాసుడు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దేవేరులతో తిరువీధి వేడుకలో స్వామి వారు ఎంవీపీ కాలనీ సెక్టార్-6, సెక్టార్-2, సెక్టార్-3 వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దారి పొడవునా స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని ఆశీస్సులు తీసుకున్నారు.

ఆలయ రాజగోపురానికి మరమ్మతులు



రాట కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు పోలమాంబ ఆలయ రాజగోపురం మరమ్మతులకు గురువారం శ్రీకారం చుట్టారు. నగరానికి చెందిన సిరిమల్ల వెంకటేష్, రాధారాణి దంపతులు రాజగోపురానికి పెయింటింగ్, గోపురంపై విగ్రహాలకు మరమ్మతులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు పనులను గురువారం రాట వేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.గాయత్రి, ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకరరావు, సభ్యులు మాదు మంగరాజు, నీలాపు నైటమ్మ, నండూరి కృష్ణమోహన్, మరడ నాగమణి, మారెడ్ల సత్య వెంకట రమణమ్మ, బిడుమూరి భారతి, అర్చకులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి

డాబాగార్డెన్స్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. జోన్-4 సూయిజ్‌ఫాం వద్ద చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలనే డిమాండ్లతో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే నగరంలో చెత్త పేరుకుపోయిందన్నారు. పోటీ కార్మికులను తీసుకొచ్చి వారితో పని చేయించడం సరి కాదన్నారు.

కొత్త పద్ధతుల్లో పాఠ్యాంశాల బోధన అవసరం



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని 19 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం సమావేశం నిర్వహించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఎన్ఈపీ-2020 ప్రకారం కొత్త పద్ధతుల్లో పాఠ్యాంశాల బోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ దుర్గాభవాని, కార్యదర్శి వి.విశ్వనాథం, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని సీతమ్మధారకు చెందిన ఎం.విమల అనేదాత రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్ అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పద్య సాహిత్యం అవసరం



మాట్లాడుతున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

సీతంపేట: ప్రసన్నభారతి ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సాహిత్య సభ జరిగింది. ప్రసన్నభారతి అధ్యక్షుడు ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజాంకు చెందిన గార రంగనాథం రచించిన 'రాయరత్న మంజూష' విమర్శ గ్రంథానికి, పాల్వంచకు చెందిన అచ్యుతానంద బ్రహ్మచారి రచించిన 'సాందీపని చరిత్ర' పద్యకావ్యానికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ భావితరాలకు తెలుగు భాష సంప్రదాయ సాహిత్యాన్ని, విలువలను అందజేస్తున్న ప్రసన్నభారతి కృషిని ప్రస్తావించారు. రచయితలు డి.వి.సూర్యారావు, బులుసు వెంకటేశ్వర్లు, ప్రసన్న భారతి కార్యదర్శి సర్వేశ్వర ప్రసాద్ పద్య సాహిత్యం వైభవాన్ని, పద్య సాహిత్యాన్ని నిలబెట్టాల్సిన అవసరాన్ని వివరించారు.